క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్యశిబిరం



పొదలకూరు: స్థానిక సీహెచ్‌సీలో నేత్ర వైద్య శిబిరాన్ని అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. హాజరైన వారికి నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.

జేబు దొంగల హల్‌చల్

మనుబోలు: మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు మనుబోలు బైపాస్‌రోడ్డు వద్దకు టీడీపీ నేతలు భారీగా తరలివచ్చారు. ఇదే అదునుగా కొందరు జేబు దొంగలు హల్‌చల్ చేశారు. కొందరి జేబుల్లోని నగదు, పర్సులు మాయం కాగా, మరికొందరి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఓ మీడియా ప్రతినిధి ప్యాంట్ జేబులోని రూ.1500ను మాయం చేశారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

నెల్లూరు సిటీ : ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో బల్కర్ వాహనం చెట్టును ఢీకొని క్లీనర్ మృతిచెందిన ఘటన కాకుపల్లిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన కుసులేందర్(21) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బల్కర్‌లో యాష్‌లోడ్‌తో ముత్తుకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్నారు. కాకుపల్లి వద్ద ముందు వెళ్తున్న మరో లారీని క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొంది. దీంతో చెట్ల కొమ్మలు లోపలకు చొచ్చుకొచ్చి క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం వల్ల ఇతర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్ 14న ఎస్టీ వర్గీకరణ భేరి



మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరిని నిర్వహించనున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. నగరంలోని గిరిజనభవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం, యానాది గిరిజన ఉద్యోగుల సంఘాల కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలన్నారు. ఇందులో భాగంగా అదే రోజు యానాది రిజర్వేషన్ పోరాట సమితిని ప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చేవూరు సుబ్బారావు, చెలంచర్ల పెద్ద బ్రహ్మయ్య, చెంబేటి ఉషా, రాపూరు కృష్ణయ్య, తలపల చెంచుమల్లికార్జున, చంద్రమౌళి పాల్గొన్నారు.

'రంగడి' బ్రహ్మోత్సవాలకు స్తంభ ప్రతిష్ట నేడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మార్చి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు నాందిగా సోమవారం ఉదయం 9 గంటలకు స్తంభ ప్రతిష్ట (పందిరి గుంజ) జరుగనుందని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు చుక్కలు

నెల్లూరు (టౌన్) : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తోందని పీఆర్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులకు జరిగిన క్లస్టర్ సమావేశం సాయంత్రం 5 గంటలకు ముగిసినా ముఖ హాజరును 6 గంటల వరకు అనుమతించలేదన్నారు. హాజరు వేయకుండా వెళ్లిన ఉపాధ్యాయులు అధికారులకు సంజాయిషీ ఇవ్వాలని బెదిరించడం దారుణమన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెడతామని చెప్పిన లోకేశ్ ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పిన చంద్రబాబు నుంచి ప్రస్తుతం ఎలాంటి స్పందన లేదన్నారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం

నెల్లూరు(సెంట్రల్) : సీతారామపురం మండలంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అందజేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ నిర్వాహకులకు ఈ విరాళాన్ని ఆదివారం అందించారు. కాగా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి వేమిరెడ్డి దంపతులను అర్చకులు ఆహ్వానించారు.

ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులు

- జగనన్న కాలనీల లబ్ధిదారులపై కక్షసాధింపు
- గత ప్రభుత్వంలో అర్హులకు పట్టాల పంపిణీ
- సర్వేపల్లిలో నిర్మాణ పనులు ప్రారంభం
- సర్వే పేరిట అడ్డుకున్న అధికారులు



సర్వేపల్లిలోని జగనన్న కాలనీలో ఆగిన నిర్మాణ పనులు

వెంకటాచలం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేసుకోనీయకుండా కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోంది. వెరిఫికేషన్ పేరుతో ఎవరూ పనులు చేయొద్దంటూ ఇటీవల వరకు అధికారులు అడ్డుకున్నారు. తాజాగా సర్వే అంటూ మరోసారి ఇదే తరహాలో వ్యవహరిస్తుండటంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

350 మందికి పట్టాలు

మండలంలోని సర్వేపల్లిలో గల జగనన్న కాలనీలో గత ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలను గుర్తించి 350 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో కొందరు నిర్మాణ పనులను అప్పట్లోనే ప్రారంభించారు. మరికొందరికి గృహాలు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులను ప్రారంభించలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల మంజూరుపై లబ్ధిదారులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. పంపిణీపై వెరిఫికేషన్ చేస్తున్నామని, పూర్తయ్యాక మంజూరు చేస్తామంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఇలా ఎనిమిది నెలలు గడిచినా ఇళ్లను మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు తమ సొంత నగదుతో నిర్మించుకోవాలని నిశ్చయించుకున్నారు. ఇందులో భాగంగానే ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు నాలుగు రోజుల క్రితం నిర్మాణ పనులు చేపట్టేందుకు ఉపక్రమించారు.

సర్వే పేరుతో అడ్డగింత

సర్వేపల్లిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. వీఆర్వో సూర్య, పోలీసులు అక్కడికి చేరుకొని పనులు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో పనులు చేసుకుంటే మీ అభ్యంతరమేమిటని లబ్ధిదారులు నిలదీశారు. ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించిన సర్వే జరుగుతోందని, పూర్తయ్యాక నిర్మాణ పనులు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించడంతో వారు మండిపడుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారనే కారణంతోనే అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇళ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలి



గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణ పనులు చేస్తుంటే సర్వే జరుగుతోందంటూ వీఆర్వో వచ్చి అడ్డుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలి.

– నాగమణి, సర్వేపల్లి

పనులను అడ్డుకోవడం అన్యాయం



అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపే అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. మాకు కేటాయించిన స్థలాల్లో పనులు చేసుకుంటే అడ్డుకోవడం అన్యాయం. అధికారులు చొరవ చూపి న్యాయం చేయాలి.

– కొల్లు వెంకమ్మ, సర్వేపల్లి

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తోటపల్లిగూడూరు: బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత అని నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని వరిగొండలోని రావూరివారికండ్రిగ గిరిజన కాలనీలో నెల్లూరు యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. వీటిని జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు, బాలకార్మిక, వెట్టి చాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, పోక్సో యాక్ట్ తదితరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్సైలు శ్రీహరి, సతీష్, సిబ్బంది ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అలా వదిలేశారు



గండవరంలో నిరుపయోగంగా షాదీ మంజిల్

- కొడవలూరులోని షాదీ మంజిల్‌కు నిధుల మంజూరు
- గండవరంలోని భవనాన్ని పట్టించుకునే నాథుడే లేరు
- వినియోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగం

కొడవలూరు : మండలంలోని గండవరంలో నిరుపయోగంగా ఉన్న షాదీ మంజిల్‌ను ఎవరూ పట్టించుకోకుండా అలా వదిలేశారు. ఇక్కడి షాదీ మంజిల్‌తో పాటు కొడవలూరులోని షాదీ మంజిల్‌ను ఒకే సమయంలో అంటే సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. అయితే ఈ రెండూ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. కాగా ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొడవలూరులోని షాదీ మంజిల్‌ను సందర్శించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే సమయంలో నిర్మించిన గండవరంలోని షాదీ మంజిల్‌ను పట్టించుకోవడం మరిచారు. ఈ గ్రామంలో ముస్లిం కుటుంబాలు మెండుగా ఉన్నాయి. ప్రసిద్ధ సాతో షహీద్ దర్గా కూడా ఇక్కడే ఉంది. ఏటా రొట్టెల పండగ అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. ఆ సమయంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు విడిది చేసేందుకు వీలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఇక్కడి షాదీ మంజిల్‌ను వినియోగంలోకి తెస్తే అలాంటి సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. మండలంలో కేవలం రెండు షాదీ మంజిల్‌లు మాత్రమే ఉన్నాయి. ముస్లిం కుటుంబాలు మాత్రం ఒకట్రెండు మినహా ప్రతి పంచాయతీలోనూ ఉన్నారు. కాగా రెండూ వినియోగంలో ఉంటే ముస్లింలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులైనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి నిధుల మంజూరుకు కృషి చేస్తే ఎన్నో ముస్లిం కుటుంబాలకు మేలు జరుగుతుంది.

పద్మశాలి సంఘాన్ని బలోపేతం చేస్తాం



పొదలకూరు: పద్మశాలి సంఘాన్ని గ్రామాల్లో సైతం బలోపేతం చేసేందుకు మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని అఖిల భారత పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో పద్మశాలి సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం మండల సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పద్మశాలీల అభ్యున్నతికి తమ సంఘం పాటుపడుతోందని చెప్పారు.

మండలాధ్యక్షుడిగా చొప్పా

పద్మశాలి సంఘ మండలాధ్యక్షుడిగా చొప్పా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా సోమా భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతగింజల చినసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, పొదలకూరు మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, రాష్ట్ర నేత వూకోటి లక్ష్మీనారాయణ, జాతీయ కార్యదర్శి వద్ది నరసింహులు, రాష్ట్ర గౌరవ సలహాదారు జగ్గారపు శ్రీనివాసులు, రాష్ట్ర సహ కన్వీనర్లు మునగపాటి వెంకటేశ్వర్లు, అందే జగదీశ్, బండ్ల పరమేష్ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గ్రంధి సుబ్బారావు కుమారుడు సాయి రేవంత్ కుమార్, యశస్విని సాయిఅఖిల వివాహం నెల్లూరులో ఆదివారం జరిగింది. ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

వేళాంగణి చర్చిలో ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: కోడూరులోని వేళాంగణి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను ఆదివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా హాజరయ్యారు. చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న పరామర్శ



హరిధర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : మండలంలోని రెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నీలకంఠం శ్రీధర్‌రెడ్డి సోదరుడు హరిధర్‌రెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావులు రెడ్డిపాళెంలోని వారి నివాసంలో హరిధర్‌రెడ్డి మృతదేహాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నలుబోలు సుబ్బారెడ్డి, విడవలూరు, కోవూరు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి ఉన్నారు.

స్విమ్మర్ నాగరాజుకు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : స్విమ్మర్ తులసి నాగరాజును పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన 1.5 కిలోమీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో 51–60 సంవత్సరాల విభాగంలో నాగరాజు ద్వితీయ స్థానం సాధించారన్నారు. దీంతో పెన్నానది తీరంలో సన్మానించినట్లు వివరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మునగా నాగేశ్వరరావు, హైటెక్ ఫార్మా కంపెనీ అధినేత రమణారెడ్డి, సుధాకర్‌రాజు, బీవీ కృష్ణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ వెంకటకృష్ణయ్య

విడవలూరు : వరిసాగు చేస్తున్న రైతులు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య కోరారు. మండలంలోని వరిణి, గాదెలదిన్నె గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి వచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి వివిధ పథకాల కోసం నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సహాయకులు ఎం.సాయిమహేష్, ఎం.వెన్నెల, పూజిత పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్) : రాష్ట్ర వ్యాప్తంగా అన్నిశాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రాజుభవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ రిటైర్డ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాహనాల నిర్వహణకు బడ్జెట్ కేటాయించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు తెల్లరేషన్ కార్డు ఇచ్చి ప్రభుత్వ పథకాలు వచ్చేలా చూడాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రభుత్వ రిటైర్డ్ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆలపాటి సుధాకర్, పొదిలి చిన్నయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా అరవ భాస్కర్, కోశాధికారిగా ఎల్లయ్య, ఈసీ మెంబర్లుగా హజరత్తయ్య, పురుషోత్తం, దశయ్యలను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యండమూరి నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబులను ఎన్నుకున్నారు.

సందడే.. సందడి



ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ ఆదివారం కోలాహలంగా మారింది. పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. కుటుంబసమేతంగా విచ్చేసిన సందర్శకులు సముద్రస్నానాలను ఆచరించి ఉపశమనం పొందారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన రాకపోకలు సాయంత్రం వరకు కొనసాగాయి.

– తోటపల్లిగూడూరు

చెట్లకు ఏదీ రక్షణ?

- నేలకూలుతున్న భారీ వృక్షాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



యథేచ్ఛగా సాగుతున్న చెట్ల నరికివేత

బుచ్చిరెడ్డిపాళెం : కొందరి స్వార్థానికి పచ్చదనం బలైపోతోంది. చెట్లను సంరక్షించాల్సిన అధికారులు తప్పకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడంతో భారీ చెట్లు నేలమట్టం అవుతున్నాయి. మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాళెం–జొన్నవాడ రహదారి మార్గమధ్యలో పెనుబల్లి వద్ద ఏళ్ల తరబడి నుంచి పెరిగిన మహా చెట్లను కొందరు విచక్షణారహితంగా నరికేశారు. దీనిపై స్థానిక ప్రజలు ఆర్అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతా అయిపోయిన తరువాత అధికారులు తాపీగా వచ్చి మిగిలిన కొమ్మలను నరికారు. స్థానికులు ఇదేమని ప్రశ్నించగా తామె తిరిగి చెట్లను నాటుతామని చెప్పడం గమనార్హం. ప్రకృతిని నాశనం చేసే వారిపై కేసులు పెట్టకుండా అధికారులు మౌనం వహిస్తుండడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు చెట్లను నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రకృతిని కాపాడాల్సిందిగా కోరుతున్నారు.







నరికేసిన చెట్టు కొమ్మలు